క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణంతోపాటు మండల గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏడీఈ బి. అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యుత్ చోరులకు జరిమానా

తెనాలిరూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారికి అధికారులు జరిమానా విధించారు. విద్యుత్ విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, తెనాలి ఈఈ వీవీ చిరంజీవి, డీఈఈ బి. అశోక్ కుమార్, ఏఈ సీహెచ్ వసంతరావు ఆధ్వర్యంలో తెనాలి పట్టణం, మండల గ్రామాల్లోని విద్యుత్ సర్వీసులను శుక్రవారం తనిఖీ చేశారు. మొత్తం 5086 సర్వీసులను తనిఖీ చేయగా అదనపు లోడు వినియోగిస్తున్న 206 సర్వీసులను గుర్తించి వినియోగదారులకు రూ. 9,96,000 జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఎనిమిది మంది వినియోగదారులకు రూ. 1,30,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మనసుకవి' ఆత్రేయ వర్ధంతి



తెనాలి: ప్రముఖ సినీరచయిత ఆచార్య ఆత్రేయ 39వ వర్ధంతిని శుక్రవారం సాయంత్రం స్థానిక గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన సభకు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం అధ్యక్షత వహించారు. కన్వీనర్ తన్నీరు శివశంకర్ స్వాగతం పలికారు. రచయిత, నాటక దర్శకుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, రచయిత, కవి రంగిశెట్టి రమేష్, కళాకారులు కన్నెగంటి మధు, కనపర్తి బెన్‌హర్, భీమేశ్వరప్రసాద్, విజయలక్ష్మి, విజయదుర్గ, విజయసారథి, ఎంపీ రఘునాధరావు, చందు సూర్య, రమేష్, కాలేషావలి మాట్లాడారు. తొలుత ఆత్రేయ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ఆత్రేయ రాసిన పాటలను కళాకారులు ఆలపించారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ అందిస్తున్నాం

ఏలూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ శేషుకుమార్



తెనాలి: వాణిజ్య బ్యాంకులకన్నా ఏలూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీని ఇస్తున్నట్టు ఆ బ్యాంక్ తెనాలి శాఖ మేనేజర్ శేషుకుమార్ చెప్పారు. బ్యాంకు శాఖలో శుక్రవారం ఖాతాదారుల సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంక్ మేనేజరు అధ్యక్షత వహించారు. సాధారణ వ్యక్తికి కూడా అత్యున్నత సేవలను అందిస్తున్న తమ కో–ఆపరేటివ్ బ్యాంక్‌ను ఆదరించాలని కోరారు. తనఖా భూములు, ఫిక్స్‌డ్ డిపాజిట్లతోపాటు లాకర్ సౌకర్యం కూడా ఉందన్నారు. బ్యాంకు అందజేస్తున్న సేవలను గురించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, ఖాతాదారు యక్కల శ్రీమన్నారాయణకు అందజేశారు. బ్యాంక్ అధికారి రవి మోహన్ పర్యవేక్షించారు. సిబ్బంది దుర్గాభవని, మౌనిక, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర ఎస్ఐగా కోటేశ్వరరావు

కొల్లిపర: మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పి.కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి రూరల్ ఎస్ఐ–2గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న ఆర్.రవీంద్రారెడ్డి వీఆర్‌కు వెళ్లి అక్కడ నుంచి తాడేపల్లి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ కాళికామాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి నెలలో రెండో శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మేకా సురేష్, కందెపి సీతారామయ్య, నీరంజన్, సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, సి.హెచ్.హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు

- ప్రతిరోజు 30 నుంచి 40 మంది జిల్లా వైద్యశాలకు వస్తున్న రోగులు
- జిల్లా వైద్యశాలలో ప్రత్యేక వార్డు ఏర్పాటు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



జిల్లా వైద్యశాలలో జ్వరపీడితులతో నిండిన వార్డు

తెనాలిఅర్బన్: డివిజన్‌లో విషజ్వరాలు, డెంగూ, టైఫాయిడ్, వాంతులు, విరోచనాలు, నిమోనియా వంటి రోగాలు ప్రబలుతున్నాయి. ఇటీవల తరచూ వర్షాలు పడుతుండటం.. తెనాలి సమీపంలోని లంక గ్రామాల్లో వరదలు సంభవించటం వంటి వాటి వల్ల వ్యాధులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో జిల్లా వైద్యశాల అధికారులు జ్వరపీడితుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలో ప్రతిరోజు వెయ్యికి పైగా ఓపీ ఉంటోంది. వాటిలో సాధారణ జ్వర పీడితులు 30 నుంచి 40 మంది ఉంటున్నారు. వీరు కాకుండా డెంగ్యూ లక్షణాలతో రోజుకు అయిదుగురు, టైఫాయిడ్, వాంతులు, విరోచనాలు వంటి వ్యాధులతో బాధపడేవారు ప్రతిరోజు పదుల సంఖ్యలో వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నారు. జ్వరపీడితులలో ఎక్కువగా కొల్లిపర, కొల్లూరు మండలాల పరిధిలోని లంక గ్రామాల ప్రజలు, తెనాలి, దుగ్గిరాల, వేమూరు, రేపల్లె, అమృతలూరు, చుండూరు తదితర మండలాల పరిధిలోని వారు ఉన్నారు.

జిల్లా వైద్యశాలలో ప్రత్యేక వార్డు ఏర్పాటు

తెనాలి జిల్లా వైద్యశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక జ్వరాల వార్డును ఇటీవల అధికారులు ఏర్పాటు చేశారు. జ్వరాలతో వచ్చే వారికి ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. ఇది నిండిపోయిన సందర్భంలో మేల్ మెడికల్, ఫిమేల్ మెడికల్ వార్డులతో పాటు అత్యవసర చికిత్స అందించాలని భావించే వారిని ఐసీయూలో ఉంచుతున్నారు. వర్షాలు, వరదలు ఎక్కువగా సంభవించటం వల్ల కొన్ని ప్రాంతాల్లో నీరు కలుషితమైందని, అవి తాగిన వారికి ఎక్కువగా వాంతులు, విరోచనాలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నిమోనియాతో బాధపడే వారి సంఖ్య కూడా ఇప్పుడిప్పుడే పెరుగుతున్నట్లు సమాచారం.



మందుల కోసం వేచి ఉన్న రోగులు

నిండిపోతున్న వార్డులు

తెనాలి జిల్లా వైద్యశాలలోని మెడికల్ వార్డులు జ్వరపీడితులతో నిండిపోతోంది. చికిత్సకు అవసరమైన మందులను కూడా దాదాపు అందుబాటులో ఉంచారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి త్వరగా రిపోర్టులు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఎక్కువ మందికి డెంగ్యూ లక్షణాలు కన్పిస్తుండటంతో వారికి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ ఎక్కించటం మినహా మిగిలిన అన్ని సేవలు ఇక్కడ అందిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



విషజర్వాలు, డెంగ్యూ, టైఫాయిడ్, నిమోనియా, వాంతలు, విరోచనాలతో బాధపడేవారు తెనాలి జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం ఎక్కువగా వస్తున్నారు. ఇటీవల లంక గ్రామాలలో వరదలు సంభవించటం వల్ల ఆయా గ్రామాల నుంచి ఎక్కువ మంది వీటితో బాధపడుతూ ఇక్కడికి వస్తున్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి, జ్వర లక్షణాలు కన్పించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలి.

–డాక్టర్ టి.వినిల్, ఫిజీషియన్, జిల్లా వైద్యశాల, తెనాలి.

ప్రత్యేక వార్డులో చికిత్సలు



తెనాలి జిల్లా వైద్యశాలకు జ్వరపీడితుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాం. చికిత్సకు అవసరమైన అన్ని రకాల మందులు, పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి పరిస్థితి ఏర్పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలి. అలాగే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి.

ఎస్సీ రిజర్వేషన్లపై తీర్పును నిలుపుదల చేయాలి

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి



సబ్‌కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం ఇస్తున్న సమితి నేతలు

తెనాలి: ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రాలు కులాలవారీగా వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంటు జోక్యం చేసుకుని నిలుపుదల చేయాలని కోరుతూ తెనాలి డివిజన్ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఎటువంటి వర్గీకరణ చర్యలు చేపట్టవద్దని సమితి నాయకులు కోరారు. ఆ ప్రకారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహకు అందజేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమనీ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ మాల కులంతోపాటు అన్ని ఎస్సీ కులాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కొన్ని దళిత వ్యతిరేక రాజకీయ పార్టీలు దళితుల మధ్య విభేదాల కల్పనకు పన్నిన కుట్రలో భాగమే ఇదనీ, దీనివల్ల ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహించినట్టు కాగలదని పేర్కొన్నారు. న్యాయవాదులు కంచర్ల కోటేశ్వరరావు, పిల్లి ప్రేమరాజ్, గుమ్మడి రవిరాజు, బహుజన సమాజ్ పార్టీ తెనాలి ఇన్‌చార్జి కారుమంచి సునీల్ సందీప్, మాల మహానాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు బొనిగల ప్రవీణ్, హైకోర్టు న్యాయవాది పొందుగల చైతన్య, చేబ్రోలు కిషోర్, పెనుమాల ప్రభాకర్, యనమదిరి శ్యామ్, పెరికల రమణయ్య, లక్ష్మీనారాయణ, వరుణ్, మరి, చెరుకూరి చింటూ పాల్గొన్నారు.

17 నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

మున్సిపల్ కమిషనర్ శేషన్న



డ్రోన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో ఈ నెల 17 నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలోని 40 వార్డులలో డ్రైవ్ కొనసాగాలన్నారు. ప్రతి రోజు కొన్ని వార్డులను ఎంచుకుని అక్కడ పారిశుద్ధ్య నిర్వహణను చేయాల్సి ఉంటుందన్నారు. అందరూ సమిష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఎసీబీ సుబ్బారావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇమ్యూనిటీస్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. రజక చెరువులో డ్రోన్ ద్వారా దోమల లార్వాను చంపే కిమోఫాస్ మందును శుక్రవారం చల్లించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమల వ్యాప్తి పెరిగిందన్నారు. దోమల నియంత్రణలో భాగంగా నీటిలో ఉండే లార్వాను అంతముందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని ఖాళీ స్థలాలు, చెరువుల్లో కిమోఫాస్ మందును చల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు లంక గ్రామాల్లో పశుగ్రాసం పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న పశుగ్రాసం

కొల్లిపర: ఇటీవల కృష్ణా నది వరదలు కారణంగా పంటలు, గృహాలు, పశువులకు చెందిన పాకలు, వెండి గడ్డి వంటి వివిధ రకాలగా దెబ్బతిన్న లంక గ్రామాల్లో శనివారం శ్రీశైల భక్త సేవా సమితి తెనాలి వారి ఆధ్వర్యంలో 400 మంది పాడి రైతులకు పశుగ్రాసం పంపిణీ చేస్తున్నట్లు శ్రీశైల భక్త సేవా సమితి తెనాలి అధ్యక్షులు ఆళ్ళ వెంకట సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మునకపల్లి లంక, కనిగిరి లంక, ఈపురు లంక, ఆవులవారిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక ఆయా గ్రామాల్లో ముందుగా గుర్తించిన 400 మంది పాడి రైతులకు పశుగ్రాసం శ్రీశైల భక్త సేవా సమితి తెనాలి వారి తరుపున ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 400 మందికి 25 కేజీల మినప పొట్టు, 25 కేజీల కామదేను మిక్సర్, 2 కేజీల బెల్లం ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు దేవిప్రియ ఫంక్షన్ హాల్, కొత్తపేట, తెనాలి నుంచి ఆయన జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కావున ఆయా గ్రామాల్లోకి సంస్థ వారు వచ్చిన సమయంలో పాడి రైతులకు సంస్థ తరుపున అందించిన టోకెన్ తీసుకుని పశుగ్రాసం బస్తాలు తీసుకోవాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి

తెనాలి: తక్కువ ఖర్చుతో పోషక విలువలు అధికంగా ఉండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పట్టణ 29వ వార్డులోని సుల్తానాబాద్ దళితవాడలో శుక్రవారం లబ్ధిదారులకు, స్థానికులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషక విలువలు అధికంగా కలిగిన పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు అధికంగా తీసుకోవాలని సునీత తెలిపారు. జామ, బత్తాయి, అరటి, మునగాకు, తోటకూర వంటివి ప్రతిరోజూ ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పిల్లలకు బర్గర్‌లు, లేసులు, కుర్‌కురేలకు బదులుగా నవ్వుండలు, పప్పుండలు, పండ్లు తీసుకొనేలా చూడాలన్నారు. దీనివల్ల పిల్లలు వయసుకు తగిన ఎత్తు, బరువు పెరుగుతారనీ, మహిళల్లో రక్తహీనత సమస్య రాదని వివరించారు.

డాక్టర్ సంజయ్‌కు బంగారు పతకం

తెనాలిరూరల్: పట్టణ బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఏ తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి ధార్మిక బంగారు పతకాన్ని కాటూరి వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వై. సంజయ్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా అన్ని వయసుల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ సంజయ్ వివరించారు. నిపుణులైన వైద్యుల సూచన మేరకు వ్యాయామాలు చేస్తూ ఆహారపు అలవాట్లలో మార్పులు చేయాలని సూచించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పావనిప్రియాంక, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ సాంబశివుడు, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ మాధవి, ఇతర ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

మోసం చేసిన యువకుడిపై కేసు

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుతోటకు చెందిన యువతి, హైదరాబాద్‌కు చెందిన తమ సమీప బంధువైన యువకుడు శ్యామ్ కుమార్ అలియాస్ శ్యామ్‌సన్ ప్రేమించుకున్నారు. ప్రేమ పేరుతో శారీరకంగానూ దగ్గరయ్యాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరించాడంటూ యువతి తెనాలి పోలీసులను శుక్రవారం ఆశ్రయించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి ఆర్టీసీకి రూ.3.16 లక్షలు నష్టం

డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్

తెనాలిఅర్బన్: వరదలు కారణంగా తెనాలి ఆర్టీసీ డిపోకు రూ.3.16 లక్షల నష్టం సంభవించిందని మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదలు ఎక్కువగా రావడం వల్ల అనేక గ్రామాలు ముంపుకు గురయ్యాయని గుర్తు చేశారు. అలాంటి గ్రామాలకు కూడా ప్రయాణీకులు తక్కువ మంది ఉన్న సర్వీసులు నడపడం జరిగిందన్నారు. వరద ఉధృతి తక్కువగా ఉన్న లంక గ్రామాలు కూడా బస్సు సర్వీసులు నడిపినట్లు చెప్పారు. ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో కొంత నష్టపోతామని తెలిసిన బస్సులను నడిపినట్లు చెప్పార. ఆర్టీసీ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

క్వారీ అర్జీపై తహసీల్దార్ విచారణ



తెనాలిరూరల్: క్వారీ తవ్వకానికి అనుమతులు కోరుతూ వచ్చిన దరఖాస్తుపై తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్రవారం విచారణ చేపట్టారు. రూరల్ మండల గ్రామం కొలకలూరు గరువు పొలాల్లో గ్రావెల్ క్వారీ తవ్వకానికి అనుమతులు కోరుతూ గ్రామస్తుల నుంచి వచ్చిన అర్జీ పరిశీలనకు వచ్చిన ఆయన భూ సంబంధిత రికార్డులను పరిశీలించారు. క్వారీ అనుమతి కోరిన భూమి యజమాని అందుబాటులో లేకపోవడంపై వీఆర్వోను ప్రశ్నించారు. క్వారీ తవ్వకానికి అనుమతి కోరిన భూమికి నలుదిక్కులా ఉన్న హక్కుదారుల నుంచి ధ్రువీకరణ తీసుకోవాలని ఆర్ఐ, వీఆర్వోను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ తవ్వకానికి అనుమతులు కోరుతూ వచ్చిన అర్జీ పరిశీలిస్తున్నామని, అదే సమయంలో క్వారీ తవ్వకాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. భూ యజమాని సమక్షంలో మరోసారి పరిశీలన ఉంటుందన్నారు. ఆయన వెంట ఆర్ఐ వి. జాన్, సర్వేయర్లు మౌనిక, మధు, వీఆర్వో సురేష్ ఉన్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి



నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

తెనాలి: తెలుగుజాతి గర్వించదగ్గ కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి దేశంలో కార్మిక, కర్షక ఐక్యతకు, ఐక్యకార్యాచరణ కోసం జీవితాంతం కృషిచేశారని శుక్రవారం స్థానిక చెంచుపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సంతాప సభలో పలువురు నివాళులర్పించారు. సీపీఎం తెనాలి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు పార్టీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ అధ్యక్షత వహించారు. సీపీఎం అఖిల భారత కార్యదర్శిగా సుందరయ్య తర్వాత అత్యధిక కాలం బాధ్యతల్లో ఉన్నదీ సీతారాం అని గుర్తుచేశారు. బహుభాషా కోవిదుడైన ఆయనకు ప్రపంచంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీల నాయకులతో సౌహార్ద్ర సంబంధాలు ఉన్నాయని చెప్పారు. పార్టీ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, ఏరియా కమిటీ సభ్యులు షేక్ హుస్సేన్‌వలి, పి.జోనేష్, కె.రవికుమార్, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్. రాజ్యలక్ష్మి, బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర నాయకుడు వై.అశోక్, ఐక్యప్రజాచైతన్య నాయకుడు ఆర్.శివకృష్ణ, రిటైర్డ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రసాద్, లక్ష్మణ రావు, భవన నిర్మాణ సంఘం నేత శ్రీనివాసరావు, రాడ్‌బెండింగ్ యూనియన్ నాయకుడు శెట్టి యేసోబు, విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేత ఎం.రామచంద్రయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.జయలక్ష్మి, జి.వెంకటసుబ్బయ్య, చుక్కపల్లి శేషగిరిరావు, రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శంకరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించారు.

అధునాతన టెంట్లతో సినిమా ప్రదర్శన

- సినిమా ప్రదర్శనలో నవశకానికి శ్రీకారం
- ప్రభుత్వం అవకాశమిస్తే చిన్న సినిమాలకు వరం
- ఏపీ–మా వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: అధునాతన టెక్నాలజీతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తాత్కాలిక టెంట్లలో పెద్ద స్క్రీన్‌తో సినిమాలను ప్రదర్శిస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామంగా ఏపీ–మా వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇందుకు అవకాశం కల్పిస్తే, చిన్న సినిమాలన్నీ విడుదలకు నోచుకుంటాయని, ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలని కోరారు.
స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో శుక్రవారం కార్య నిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. తమ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.
తాత్కాలిక టెంట్లతో కేవలం రూ.50 టికెట్‌పై అన్ని మేజర్ పంచాయతీల్లోనూ సినిమాను ప్రదర్శించవచ్చనీ తెలిపారు. వినోదపన్ను మినహాయింపుతో సహా కొన్ని రాయితీలకు ప్రభుత్వం చొరవ చూపితే, సినిమా ప్రదర్శనలో కొత్త శకం ఆరంభం కాగలదన్నారు. థియేటర్లు దొరక్క, వదలకొద్దీ చిన్న సినిమాలు విడుదలకు నోచుకోలేదని గుర్తుచేశారు.
ఒక నెలలో పెద్ద సినిమాలకు మూడు వారాలు, మరో వారం చిన్న సినిమాల విడుదలకు అవకాశం కల్పించేలా చేసినా బాగుంటుందన్నారు సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో అతిథులు

తెనాలి: పట్టణ మారిస్ పేట లోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకలకు హిందీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనిమిరెడ్డి విజయకుమార్ అధ్యక్షత వహించారు. 1949 సెప్టెంబర్ 14వ తేదీన హిందీ భాషను అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి హిందీ దివస్ వేడుకలను దేశమంతటా జరుపుకుంటున్నట్టు ఆయన గుర్తుచేశారు. హిందీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు పులి భాస్కర్ మాట్లాడుతూ సంస్కృతం నుంచి గ్రహించిన, హిందీ భాష క్రమంగా విద్యార్థులందరికీ చక్కగా అర్థమయ్యేలా సులభతరం చేశారని చెప్పారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో హిందీ ముఖ్య భాషగా ఉందన్నారు. ప్రముఖ హిందీ గురువు జీవీఎస్ వరదాచార్యులను వేదికపై ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత జీవీఎస్ వరదాచార్యులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ రెండవ భాషని, 'లాంగ్వేజ్ ఆఫ్ యూనిటీ'గా మహాత్మా గాంధీ అన్నారని గుర్తుచేశారు. హిందీ నేర్చుకుంటే దేశంలో ఎక్కడికి వెళ్లినా భాష సమస్య లేకుండా జీవించవచ్చని తెలిపారు.విద్యార్థులందరూ హిందీ చక్కగా నేర్చుకోవాలని సూచించారు. తెనాలి పట్టణంలోని గల హైస్కూళ్లలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులనూ ఇదే వేదికపై ఘనంగా సత్కరించారు.
హిందీలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. కేరళలోని వయనాడు బాధితులకు వితరణ అందించిన విద్యార్థులకూ జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. హిందీ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాటి నరేష్, ప్రధానోపాధ్యాయిని పీవీ సుధారాణి బాపట్ల జిల్లా హిందీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి పీసీహెచ్ శివకుమార్, లలిత అండ్ కో కుమార్, బి.విజయకుమారి, జ్యోతిరావు హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి, డాక్టర్ లక్ష్మిసుధ

కొల్లిపర: చిన్న పిల్లల్లో నులిపురుగులు లేకుండా ప్రతి తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకుంటూ సంవత్సర కాలంలో సుమారు మూడుసార్లు ఆల్బెన్డజోల్ ట్యాబ్‌లెట్‌ను వాడాలని మండలవైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో విజయలక్ష్మి సమక్షంలో మండల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 17న 1 నుండి 19 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రాథమిక పాఠశాలలో, హైస్కూల్‌లో ఉన్న 4533 మంది చిన్నారులకు మాత్రలను వైద్య సిబ్బంది స్వయంగా చిన్నారులకు అందించి మింగించాలని తెలిపారు. తహసీల్దారు సిద్ధార్థ మాట్లాడుతూ పాఠశాలలో పిల్లలకు పరిశుభ్రత పై అవగాహన పెంచాలని సూచించారు. డాక్టర్ లక్ష్మిసుధ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రల వలన పిల్లలకు రక్తహీనత తగ్గి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. 17వ తారీకున ఎవరైనా పిల్లలు రాకపోతే మళ్లీ 25వ తారీకున హాజకాని విద్యార్థులకు వైద్యసిబ్బంది అందించటం జరుగుతుందన్నారు.అనంతరం జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు జి.సిద్ధార్థ, ఎపీఎం డి.ప్రియదర్శిని, ఎంఈవో ఝాన్సీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.లక్ష్మి , పీహెచ్ వైద్యురాలు డాక్టర్ కె.సుమతి, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో భక్తులకు అన్నదానం



తెనాలిఅర్బన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సాయిరామ్ యూత్ ఆధ్వర్యంలో రజక చెరువు వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమకు శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.